క్లుప్తంగా

అరకులోయకు పర్యాటకుల తాకిడి

సాక్షి,పాడేరు: అరకులోయకు ఆదివారం విశాఖ నుంచి రైలులో పెద్దసంఖ్యలోనే పర్యాటకులు వచ్చారు. బొర్రాగుహలు, కటికి, తాడిగుడ, కొత్తపల్లి, చాపరాయి జలపాతాలు, లంబసింగి, తాజంగి, వంజంగి ప్రాంతాల సందర్శనకు తరలివచ్చారు.

మొబైల్ ఆధార్ కేంద్రం ప్రారంభం



పాలమామిడిలో మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీ కేంద్రంలో మొబైల్ ఆధార్ కేంద్రాన్ని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మొబైల్ ఆధార్ కేంద్రాల నమోదు, కార్డులోని వివరాల్లో మార్పుచేర్పులు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఆధార్ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెల్ఫేర్ అసిస్టెంట్ మహమ్మద్‌బషీర్, మహిళా పోలీస్ కాంచన, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రాధ, వలంటీర్లు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చింతపల్లి: మండలంలోని తమ్మంగుల పంచాయతీ గసాయిగొందిలో గ్రామస్తులకు చేయూత వారియర్స్ ట్రస్ట్ సభ్యులు నిత్యావసర సరకులు, దుస్తులను శనివారం పంపిణీ చేశారు.ట్రస్ట్ అధ్యక్షుడు దూనబోయిన రమణ ఆధ్వర్యంలో 40 గిరిజన కుటుంబాలకు ఉచితంగా బియ్యం, కూరగాయలు, దుస్తులు అందజేశారు. సర్పంచ్ లక్ష్మయ్య, ట్రస్ట్ సభ్యులు శేఖర్, రాజేష్, బిలాష్కర్, మోదగిరి తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తాపడిన టిప్పర్

గూడెంకొత్తవీధి: మండలంలోని గొడిచింత రహదారిలో శనివారం చిప్స్(కంకర) తరలిస్తున్న టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. రహదారి నిర్మాణానికి నర్సీపట్నం నుంచి గొడిచింత మీదుగా సువ్వాపల్లికి చిప్స్ తరలిస్తుండగా మార్గమధ్యలో అదుపు తప్పి బోల్తాపడింది. సంఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ



దాతలు అందజేసిన పుస్తకాలు, పెన్నులతో విద్యార్థులు

కొయ్యూరు: స్థానిక జీసీసీ బ్రాంచీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కోరాబు వెంకటరమణ, అతని కూతురు తులసి ప్రవల్లిక శనివారం రాజేంద్రపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, చాక్లెట్లను అందజేశారు. వినాయక చవితిని వేడుకలను పురస్కరించుకుని వారు రామాలయంలో వినాయ ప్రతిమను ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పీటా సింహాచలం, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు మాట్లాడుతూ వెంకటరమణ సేవా స్ఫూర్తిని కొనియాడారు. సేవా కార్యక్రమాలు చేసేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు.

ప్రజారోగ్యమే..ప్రభుత్వ ధ్యేయం

- జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన
- వైద్య శిబిరాలకు తరలివచ్చిన గిరిజనులు
- ఉచితంగా పరీక్షలు, మందులు అందజేత
- గిరిజనుల హర్షాతిరేకం



పి .యర్రగొండలోని వైద్య శిబిరానికి విచ్చేసిన గ్రామస్తులు



గంగవరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ



డుంబ్రిగుడలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండలోని సచివాలయం వద్ద చవిటిదిబ్బలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైంది. తహసీల్దార్ సీహెచ్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో వైద్యాధికారి నరేంద్రకుమార్, సచివాలయ కార్యదర్శి లోవరాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పల్లాల రాజేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజారోగ్యం జగనన్న ధ్యేయమన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్, వైద్యాధికారులు మాట్లాడుతూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నత వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా అత్యవసరమైన ఐదుగురికి ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యసేవలందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మందులు పంపిణీ చేశామన్నారు. డీటీ కె.సుధాకరరావు, ప్రత్యేక వైద్యాధికారులు జీవన్, సతీష్, జయప్రకాష్, జగదీష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. రోగులకు భోజన ఏర్పాట్లు చేశారు.

గంగవరం: మండలంలోని మోహనాపురంలో గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భావన ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీమన్నారాయణ సమక్షంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిబిరంలో వైద్యులు జె.కిరణ్‌దుర్గా ప్రసాద్, సాయిరతన్, భావన తదితరులు సుమారు 301 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ కురసం అక్కమ్మ, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, మండల పరిషత్ పర్యవేక్షకులు సిద్దేశ్వరరావు, ఈఓపీఆర్డీ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ వెంకటరావు, ఉప సర్పంచ్ జగ్గునాయుడు, నాయకులు సింహాచలం, వినోద్, వైద్యులు ప్రేమ, రాంబాబు, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ రమ, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ పాల్గొన్నారు.

కూనవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ అన్నారు. చూచిరేవులగూడెం పంచాయతీలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష పై అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు, ఆశాలు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు ఎన్‌కొండలరావు, సచివాలయం కన్వీనర్లు సత్యనారాయణ, రమేష్, లక్ష్మణరావు, బేతి ముత్తయ్య వలంటీర్లు పాల్గొన్నారు.



చూచిరేవులగూడెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



అరడకోటలో వైద్యశిబిరానికి తరలివచ్చిన గ్రామస్తులు



డుంబ్రిగుడలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రోగులు



నెల్లిపాక పీహెచ్‌సీ పరిధి చోడవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చిన రోగులు

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

కొయ్యూరు: మంప పంచాయతీ కించవానిపాలెంలో రాంకీ–నాబార్డుల ఆధ్వర్యంలో అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, సాగు తదితర అంశాలపై రైతులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రా యూనివర్సిటీ ఆర్థిక విభాగ ఆచార్యులు ఎస్.పుల్లారావు, దుర్గాభాయ్ దేశముఖ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఉషా మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక సాధికారిత సాధించవచ్చన్నారు. ఉత్పత్తులకు సరైన విలువ జోడిస్తేనే అధిక ఆదాయం పొందవచ్చన్నారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కె.శ్రీకాంత్ మాట్లాడుతూ గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధి కోసం సంస్థ తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ మేనేజర్ హరికృష్ణ, సిబ్బంది సత్తిబాబు, రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

జి.మాడుగుల: పాడేరులో యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29న జరిగిన యువజనోత్సవాల్లో గురుకుల కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్హత సాధించినట్టు ప్రిన్సిపాల్స్ పారాయ్య, ధనలక్ష్మి, విజయలక్ష్మి తెలిపారు. పాడేరు బాలికల గురుకుల కళాశాలలో చదువుతున్న ముగ్గురు, అరకులోయ బాలికల కళాశాలకు చెందిన ముగ్గురు, జి.మాడుగుల బాలుర గురుకులం కళాశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్హతన సాధించినట్టు తెలిపారు. విద్యార్థులను ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు అభినందించారు.

భారీ అన్నసమారాధనలు

హుకుంపేట/పెదబయలు: హుకుంపేట, పెదబయలు మండలాల్లో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన అన్నసమారాధనలో భారీగా భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. హుకుంపేటలో వైఎస్సార్‌సీపీ నేత గోవింద్ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. నేతలు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గడప గడపకు సంక్షేమం



గ్రామస్తులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: జగనన్న ప్రభుత్వంలో ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకలు అందుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు, మండలంలో గన్నెల పంచాయతీలో ఆర్.కె.నగర్, అమలగుడ, గన్నెల గ్రామాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో 546 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు.ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీ శ్రేణులు గ్రామాల్లో పర్యటించి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణకుమార్, జిల్లా కమిటీ సభ్యుడు గాసి, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, నాయకులు రంజిత్‌కుమార్, హరి, గురు, గణేష్, వార్డు సభ్యులు రాము, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు.

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె శనివారం సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం కోసం ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని దేశంలో మరెక్కడ చేయలేదన్నారు. ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకష్ణ , సర్పంచ్ మంగా బోజ్జయ్య, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ కారుకోడి పూజ, సొసైటీ అధ్యక్షుడు జల్లెపల్లి రామన్న దొర నారాయణ, కన్వీనర్ పండా రామకృష్ణ దొర , ఎంపీటీసీ ఉలవాల లక్ష్మీ రూతు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఎటపాక: అన్ని రకాల పోషక విలువలున్న సంపూర్ణ ఆహారంతోనే ఆరోగ్యం వస్తుందని గౌరిదేవిపేట పీహెచ్‌సి వైద్యులు టి.వి.శేషిరెడ్డి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా గన్నేరుకొయ్యపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఉత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. డాక్టర్ శేషిరెడ్డి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని, సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ శివకనకరాజు, హెచ్‌వి వాణి, అంగన్వాడీ కార్యకర్తలు అచ్చిమాంబ, రాణి, విజయలక్ష్మి, రాజమ్మ సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సిబ్బంది

రోడ్డు పనులకు భూమిపూజ

జి.మాడుగుల: మండలంలో పెదలువ్వాసింగి పంచాయతీ అలగాం గ్రామంలో శనివారం గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్ కిముడు రాంబాబు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు చెప్పారు. అలగాం గ్రామానికి రోడ్డు నిర్మాణంతో రవాణా సౌకర్యాలు అందుబాటులోని వస్తాయన్నారు. అలగాం–ఎస్తాలు వరకు 2 కిలోమీటర్లు రూ.80లక్షలతో జీఎస్‌బి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు చెప్పారు. సర్పంచ్ సీదరి కొండబాబు, ఎంపీటీసీ సభ్యుడు చిన్నారావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు రామకృష్ణ, అంద్రయ్య, నాయకులు సత్యనారాయణ, చిట్టిబాబు, గంగరాజు, పండుదొర, ప్రకాష్, చిన కొండబాబు, సూర్యప్రకాష్‌నాయుడు, బాలన్న, కృష్ణారావు తదితరలు పాల్గొన్నారు.



అలగాంలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సన్యాసిదొర, సర్పంచ్ రాంబాబు

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

పెదబయలు: మండలంలోని ఈనెల 3 నుంచి 30 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ప్రోగ్రాం అధికారి, ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య చెప్పారు. మండలంలో 3వ తేదీన పర్రెడలో, 4న బొండాపల్లి, 5వ కిముడుపల్లి, 10న పెదకోడాపల్లి, 11న లింగేటి, 12 కుంతుర్ల, 13న గిన్నెలకోట, 17న గంపరాయి, 10న సీకరి, 20న జామిగుడ, 26న అడుగులపుట్టు, 27న ఇంజరి, 30న సీతగుంటలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొయ్యూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని 3న అంతాడలో, 4న బూదరాళ్ల, 5న కొయ్యూరు, 6న అడాకుల, 7న బంగారంపేట,9న బకులూరు,పదిన చీడిపాలెం, 11న చిట్టింపాడు,12న కొండగోకిరి, 13న ఎం.భీమవరం, 16న శరభన్నపాలెం, 17న వెలగలపాలెం, 18న రేవళ్లు, 19న కొమ్మిక, 20న ఎం.మాకవరం, 21న మంప, 24న మర్రివాడ, 25న నడింపాలెం, 26న రావణాపల్లిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు.



అప్పలరాజుపేటలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని 3వ తేదీన శరభరంలో, 4న కింద్ర, 5న అమీనాబాద్, 6న తంటికొండ, 7న గడుటకుర్తి, 9న వంచంగి, 10న బడదనాంపల్లి, 11న వాతంగి, 12న దూసరపాము, 13న చికిలింత, 16న రాజవొమ్మంగి, 17న చెరకుంపాలెం, 18న లోదొడ్డి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరరావు చెప్పారు.

బూత్ కమిటీల నియామకం

గంగవరం: మండల కేంద్రంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణమ్మ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ గిరిజన మోర్చా ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బొజ్జి రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బూత్ కమిటీల నియామకం పూర్తి చేయాలని కోరారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కె.రమేష్ దొర, కె.శివ వరప్రసాద్ దొర పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం



బోరు ప్రారంభిస్తున్న సర్పంచ్ సునీల్

చింతపల్లి: మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ దోమలగొందిలో శనివారం ఎంపీ మాధవి నిధులతో సర్పంచ్ చింతర్ల సునీల్ మంచి నీటి బోరు పనులను ప్రారంభించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు నిర్మిస్తున్నట్టు ఆయన చెప్పారు. మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చౌడపల్లిలో 'నా మట్టి నా దేశం'

చింతపల్లి: విద్యార్థులందరూ స్వాతంత్ర్య సమర యోధుల చరిత్ర తెలుసుకోవాలని చౌడుపల్లి ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ అన్నారు. శనివారం పాఠశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా–మట్టి..నా–దేశం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మట్టిని సేకరించి కుండల్లో నింపారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ సమర యోధుల చరిత్ర విద్యార్థులకు తెలియాల్సి ఉందన్నారు. ఉపాధ్యాయులు దామోదరం, శ్యామల, ఆర్. వి రమణమ్మ తదతరులు పాల్గొన్నారు.



చౌడుపల్లిలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కారు ఎవరిదీ?

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం గ్రామంలో గడిచిన ఐదు రోజులుగా ఓ గుర్తు తెలియని కారు రోడ్డు పక్కగా పార్క్ చేసి ఉండడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి కారులో ఏముందో గుర్తించి, తొలగించే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



శరభవరంలో రోడ్ పక్కన పార్క్ చేసి ఉన్న కారు

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

పెదబయలు: మండలంలోని అరడకోటలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, సీడీపీడీవో రాజేశ్వరి మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహర స్టాల్‌ను పరిశీలించారు. రోజూ వారి ఆహారంలో చిరుధాన్యాలు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. నాయకులు రాజుబాబు, సింహాచలం, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణయ్య, సీడీపీవో రాజేశ్వరి

సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రామ్‌గోపాల్

చింతపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆశాజ్యోతి ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ అధికారి రామ్‌గోపాల్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సాంకేతిక సమస్యలు పరిష్కరించి అర్హులందరికీ సంక్షేమ పథకాలు పొందేలా చూడాలన్నారు. ఎంపీడీవో ఆశాజ్యోతి మాట్లాడుతూ మండలంలో 3వ తేది నుంచి జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వలంటీర్లు విస్తృత ప్రచారం చేయాలన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

వీఆర్ పురం: రేఖపల్లిలో స్థానిక గణేష్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని నిమజ్జన ఊరేగింపు శనివారం ఘనంగా జరిగింది. డ్యాన్సులతో యువత, చిన్నారులు సందడి చేశారు. అనంతరం సమీపంలో గోదావరి శబరి సంఘమ ప్రదేశంలో నిమజ్జనం చేశారు కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఖైదీ మృతిపై 7న మెజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట: సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్న పాలాసి వెంకటరావు మృతిపై ఈనెల 7న ఉదయం 11 గంటలకు మెజిస్టిరియల్ విచారణ చేస్తున్నట్టు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం బొంజంగి గ్రామం కించూరు పంచాయతీకి చెందిన పాలాసి వెంకటరావు ఒక కేసులో సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్నారు. సెప్టెంబర్ 14న అనారోగ్యానికి గురి కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. 15వ తేదీన చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆర్‌డీవో తెలిపారు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి మెజిస్టిరియల్ విచారణ చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున నిర్ణయించారు. ఈ విచారణ కోసం విశాఖ ఆర్‌డీవోను విచారణ అధికారిగా నియమించారు. విశాఖ ఆర్‌డీవో కార్యాలయంలో 7తేదీన విచారణ చేస్తున్నామని, వెంకటరావు కోసం తెలిసిన వారు ఎవరైనా విచారణకు హాజరై, లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు.